నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644


**నీలగిరి నిత్యపద్యం**

**కందం**

రాముడు కారణజన్ముడు
రాముడు దశరథ తనయుడు,రాజసమొప్పన్
రాముడు రఘుకులతిలకుడు
రాముడు ధర్మాత్ముడయ్యి రాజ్యమునేలెన్

మీ
విజయ్ప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 336 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 27-03 -2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00




# ఏపీలో ఘోర బస్సు ప్రమాదం

## మంటలు చెలరేగడంతో 14 మంది సజీవదహనం


- మార్కాపురం జిల్లా రాయవరంలో ఘటన
- టిప్పర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- హైదరాబాద్ నుంచి ప్రకాశం జిల్లా పామూరు వైపు వెళ్తుండగా ఘటన
- ప్రమాద సమయంలో బస్సులో 40మంది ప్రయాణికులు
- గురువారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో ఈ ప్రమాదం



మార్కాపురం

ఏపీలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మార్కాపురం జిల్లాలోని రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో బస్సులో ప్రయాణిస్తున్న 14మంది సజీవదహనమయ్యారు. మరికొందరికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోందిప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి ప్రకాశం జిల్లా పామూరు వైపు వెళ్తుండగా.. రాయవరం క్వారీల వద్ద వేగంగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. చీమకుర్తి నుంచి కంకర లోడుతో టిప్పర్ వెళ్తుంది. తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

-మిగతా 2 లో



## ఇరాన్‌కు మరోమారు ట్రంప్ వార్నింగ్

- ఆలస్యం చేస్తే పరిస్థితులు మారిపోతాయి
- 'ఇరాన్ మిలిటరీ పూర్తిగా నాశనమైంది
- తిరిగి పుంజుకునే అవకాశం లేదు
- త్వరగా ఒప్పందానికి రావాలని హెచ్చరిక

వాషింగ్టన్,


ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. ఒప్పందం విషయంలో మరీ ఆలస్యం చేస్తే పరిస్థితులు తీవ్రంగా మారిపోతాయని హెచ్చరించారు. అమెరికాతో ఒప్పందం కోసం ఒకవైపు ప్రయత్నిస్తూనే, బయటకు మరోలా మాట్లాడుతోందని ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరీ ఆలస్యం కాకముందే సీరియస్‌గా వ్యవహరించడం మంచిదని హితవు పలికారు.'ఇరాన్ మిలిటరీ పూర్తిగా నాశనమైంది. తిరిగి పుంజుకునే అవకాశం లేదు. దీంతో వారు ఒక ఒప్పందం కోసం మమ్మల్ని వేడుకుంటున్నారు. మరోవైపు మా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని చెబుతున్నారు. వారు చాలా తప్పు చేస్తున్నారు. మరీ ఆలస్యం కాకముందే వారు ఒక నిర్ణయం తీసుకుంటే మంచిది. ఆలస్యమైతే వెనక్కి తిరిగి

-మిగతా 2 లో

# గత ప్రభుత్వం బకాయిలు కడుతున్నాం

## ఆరోగ్యశ్రీ కింద 600 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారు


- ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించాం
- విద్య,వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం
- సిఎంఆర్ఎఫ్ నిధులను దుర్వినియోగం చేశారు
- అన్ని బాగోతాలు బయటపెట్టబోతున్నాం
- అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి రూ.600 కోట్లు బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. ఏడో రోజైన గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో సీఎం రేవంత్ ప్రసంగించారు. ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వాసు పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించామని చెప్పుకొచ్చారు. 27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామని ఆయన వివరించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు

-మిగతా 2 లో



## పద్దులపై చర్చలకు బదులు గొప్పలా?

- మిషన్ భగీరథ పేరుతో డబ్బు దుబారా
- దీనిపై ఎక్కడికైనా వెళ్లి పరిశీలిద్దామా
- సభలో బిఆర్ఎస్ సభ్యుల తీరుపై మండిపడ్డ భట్టి

హైదరాబాద్,

:బీఆర్ఎస్ శాసనసభ్యులు పద్దులపై చర్చను పక్కనపెట్టి, గత పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలన గురించి గొప్పలు చెప్పుకోవడమే లక్ష్యంగా మాట్లాడుతున్నారని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క చురకలంటించారు.. ప్రజా సమస్యలపై చర్చించాల్సింది పోయి గత ప్రభుత్వం గొప్పలు చేసిందని చెప్పడానికి ప్రాధాన్యం ఇవ్వడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీలో మహిళా శిశు సంక్షేమం పంచాయతీరాజ్ పద్దులపై జరుగుతున్న చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. పెళ్లయి బిడ్డ సంకలోకి వచ్చినా కల్యాణ లక్ష్మి చెక్కు అందలేదు' అని ఎమ్మెల్యే సునీత చేసిన వ్యాఖ్యలు వాస్తవమైతే, ఆ ఆలస్యానికి గల కారణాలను ప్రభుత్వం ఖచ్చితంగా పరిశీలిస్తుందన్నారు. సాధారణంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి

-మిగతా 2 లో



## మిత్రదేశాల జాబితాను ప్రకటించిన ఇరాన్..

- ఇండియా, చైనా, రష్యా, పాకిస్తాన్,
- ఇరాక్ దేశాల్ని మిత్ర దేశాలుగా పేర్కొంది.
- ఆ దేశాల నౌకలకే అనుమతి..
- వాటిలో ఇండియా కూడా ఉండటం విశేషం.


న్యూఢిల్లీ

హార్ముజ్ జలసంధి మూసివేయడంతో అనేక దేశాలు ఇబ్బందులు పడుతున్నాయి. దీంతో ఈ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు విజ్ఞప్తులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమ మిత్రదేశాలకు మాత్రమే ఈ జలసంధి నుంచి నౌకల రవాణాకు అనుమతులు మంజూరు చేస్తామని ఇరాన్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా మిత్రదేశాలు, శత్రుదేశాల జాబితాను విడుదల

-మిగతా 2 లో

## నేడు రాష్ట్రాల సీఎంలతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

### పశ్చిమాసియా పరిస్థితులపై రాష్ట్రాలకు వివరించే ఛాన్స్



- చమురు భద్రత, సరఫరా మార్గాలపై ప్రధాని ప్రత్యేక నజర్.
- యుద్ధ సంక్షోభం వేళ 'టీమ్ ఇండియా'గా ఐక్యంగా ఉండాలని మోదీ పిలుపు.
- ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల సిఎంలు దూరం
- సమావేశం అనంతరం కీలక నిర్ణయాలు ప్రకటించనున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ,

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ శుక్రవారం వర్చువల్‌గా సమావేశం కానున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు,

-మిగతా 2 లో

## వినియోగదారులకు షాక్

- పెట్రో, డీజిల్ ధరలు పెంచి నయారా
- లీటరు పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పన పెంచింది




న్యూఢిల్లీ,

ప్రైవేటురంగ చమురు సంస్థ నయారా ఎనర్జీ వినియోగదారులకు షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచేసింది. లీటరు పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పన పెంచింది. పెరిగిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఆయా రాష్ట్రాలు విధించే వ్యాట్ ఆధారంగా ఈ పెంపు వర్తిస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో ఈ పెంపు గరిష్ఠంగా రూ.5.30 వరకు ఉంటుంది. దేశవ్యాప్తంగా లక్షకు పైగా పెట్రోల్ పంపులు ఉండగా.. రష్యా చమురు సంస్థ అయిన రాస్‌నెఫ్ట్‌కు చెందిన నయారా ఎనర్జీ 6,967 పెట్రోల్ పంపులను

-మిగతా 2 లో

# కవిత కొత్త పార్టీ తెలంగాణ ప్రజా జాగృతి



- నేడు నిజామాబాద్ వేదికగా ప్రకటన
- పార్టీ ఆవిర్భావ వేడుకల తేదీని కూడా అదే వేదిక నుంచి వెల్లడించేందుకు సర్వం సిద్ధమైంది
- రాజకీయ నిర్ణయాలు ప్రకటించే అవకాశం

నిజామాబాద్

తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తూ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన సొంత రాజకీయ పార్టీని ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. తన రాజకీయ ప్రస్థానానికి పునాది వేసిన నిజామాబాద్ వేదికగానే ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించబోతున్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్‌లోని

-మిగతా 2 లో

# ఆరోగ్యశ్రీపై అబద్దాలు చెప్పే ప్రయత్నం

## మైక్ కట్ చేయడం ద్వారా నిజాలు దాచారు

- కాంగ్రెస్ వచ్చిన తర్వాతే ఆరోగ్యశ్రీ ఖర్చులు బాగా పెరిగిపోయాయి
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



హైదరాబాద్,

రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ వేదికగా తమ గళాన్ని వినిపించేం దుకు ప్రయత్నించినప్పటికీ, మైక్ ఇవ్వకపోవడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైకులు కట్‌చేసి తాము చెప్పాలనుకున్న వాస్తవాలను సభ దృష్టికి

-మిగతా 2 లో

## ఏపీలో ఘోర బస్సు ప్రమాదం


మొదటి తరువాయి



ండు వాహనాలు బలంగా ఢీకొనడంతో బస్సులోని డీజిల్ ట్యాంక్ పగిలి క్షణాల్లోనే మంటలు చెలరేగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మంటలు రెండు వాహనాలకు వ్యాపించడంతో రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో బస్సులో 40మంది ప్రయాణికులు ఉన్నారని సమాచారం. ప్రయాణికులంతా గాఢనిద్రలో ఉండటంతో మృతుల సంఖ్య ఎక్కువగా నమోదైందని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన కొందరు ప్రయాణికులు బస్సు కిటికీ అద్దాలను పగలగొట్టి ప్రాణాలతో బయటపడ్డారు. అయితే, పలువురికి తీవ్రగాయాలు కాగా.. వారిని చికిత్స నిమిత్తం సమీపంలో మార్కాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పలువురికి తీవ్ర గాయాలు కావడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. మృతుల్లో కనిగిరి ప్రాంతానికి చెందిన వారు ఉండొచ్చని భావిస్తున్నారు. ఘటనాస్థలాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు.

## ఇరాన్‌కు మరోమారు ట్రంప్ వార్నింగ్

మొదటి తరువాయి



చూసే ప్రసక్తే లేదు. పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి' అని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ ద్వారా హెచ్చరించారు. అమెరికాతో చర్చల పట్ల ఇరాన్ భిన్నంగా ప్రకటనలు చేస్తోంది . ఘర్షణలు ముగించేందుకు చర్చలు జరిపే ఉద్దేశం ఉద్దేశం తమకు లేదని, అమెరికా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి వ్యాఖ్యానించారు. అమెరికాతో చర్చలు జరుగుతున్న సమయంలో పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులకు పాల్పడుతోంది.


## మిత్రదేశాల జాబితాను ప్రకటించిన ఇరాన్..

మొదటి తరువాయి

చేసింది. ప్రధానంగా ఐదు దేశాల్ని మిత్రదేశాలుగా పేర్కొంది. వాటిలో ఇండియా కూడా ఉండటం విశేషం. ఇండియా, చైనా, రష్యా, పాకిస్తాన్, ఇరాక్ దేశాల్ని మిత్ర దేశాలుగా పేర్కొంది. ఈ దేశాలకు చెందిన నౌకల్ని హోర్ముజ్ జలసంధి గుండా అనుమతిస్తామని ఇరాన్ తెలిపింది. ఇప్పటికే రెండు నౌకలు బయల్దేరాయని వెల్లడించింది. అలాగే, బంగ్లాదేశ్ నౌకల్ని కూడా అనుమతిస్తామని చెప్పింది. ఈ దేశాలు ఇప్పటికే తమతో మాట్లాడాయని, తమతో సమన్వయం చేసుకుంటాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి అన్నారు. భవిష్యత్తులోనూ ఈ దేశాలకు సహకారం అందిస్తామని, యుద్ధం ముగిసిన తర్వాత కూడా సహాయం కొనసాగుతుందని ఆయన చెప్పారు. మిత్రదేశాలతోపాటు తాము అనుమతించేది లేని శతృదేశాల జాబితాను కూడా ఇరాన్ ప్రకటించింది. ఈ జాబితాలో అమెరికా, ఇజ్రాయెల్, యుద్ధంతో సంబంధం ఉన్న కొన్ని గల్ఫ్ దేశాలు, యుద్ధంలో కీలక పాత్ర పోషించిన దేశాలతో సంబంధాలు కలిగి ఉన్న కూటమి దేశాలున్నాయి. ఈ దేశాలకు చెందిన నౌకల్ని అనుమతించబోమని అరాగ్చి స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ దేశం యుద్ధం చేస్తోందని, యుద్ధం సమయంలో శతృదేశాల నౌకల్ని అనుమతించబోమని, అయితే, ఇతరులకు మాత్రం అనుమతి ఉంటుందన్నారు. మిత్రదేశాల నౌకలు ఈ మార్గం గుండా వెళ్లాలన్నా తగిన నిబంధనలు పాటించాల్సిందే. పూర్తి సమన్వయం తర్వాతే నౌకల్ని అనుమతిస్తారు. ఇప్పటికే కొన్ని నౌకలకు అనుమతి లభించింది. ఈ విధానం సంక్షోభం తర్వాత కూడా కొనసాగుతుంది. మిత్రదేశాలకు ఎప్పటికీ హోర్ముజ్ జలసంధి అందుబాటులో ఉంటుంది. అయితే, ఈ మార్గంలో ప్రయాణించే నౌకలపై ఇకనుంచి టోల్ వసూలు చేస్తామని ఇరాన్ ప్రకటించింది. ఇప్పటికే కొన్ని నౌకలు టోల్ చెల్లించినట్లు సమాచారం.

## వినియోగదారులకు షాక్

మొదటి తరువాయి




ఆపరేట్ చేస్తోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలను సవరించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరో ప్రముఖ ప్రైవేటురంగ చమురు సంస్థ రిలయన్స్-బీపీ మాత్రం పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. దేశవ్యాప్తంగా 2,185 ఔట్‌లెట్లను జియో-బీపీ నిర్వహిస్తోంది. సుమారు 90 శాతం మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వరంగ చమురు కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ , బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ మాత్రం సాధారణ పెట్రోల్, డీజల్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ప్రీమియం పెట్రోల్ ధరను మాత్రం రూ.2.30 మేరకు ఇటీవల సవరించాయి. ఇండస్ట్రియల్ డీజిల్‌ను లీటరుకు రూ.22 చొప్పున పెంచాయి.

# గత ప్రభుత్వం బకాయిలు కడుతున్నాం

మొదటి తరువాయి

సృష్టిస్తున్నాయని.. బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పీఏలు సీఎం రిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ చురకలు అంటించారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద ఇచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమే అన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవని సీఎం రేవంత్ మరోసారి తేల్చి



చెప్పారు. కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతామని అన్నారు. టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకు వస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. విద్య, పేదల వైద్యం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యాంశాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వైద్యానికి నిధులు కేటాయించి రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.2,046 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని చెప్పారు. గతంలో ఈ చెక్కుల విషయంలో అవినీతి జరిగిందన్నారు. 27 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామన్నారు. టీచింగ్ కాలేజీలకు రోగులు వెళ్లడం లేదని సీఎం అన్నారు. ఈ కాలేజీల నిర్వహణను గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకొచ్చామని వివరించారు. విదేశాల్లో నిపుణులైన వైద్యుల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. గోషామహల్‌లో 30 ఎకరాల్లో రూ.3వేల కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నామన్నారు. ఆ పనులు వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామన్నారు.

# పద్దులపై చర్చలకు బదులు గొప్పలా?

మొదటి తరువాయి

జాప్యం జరగడం లేదు. ఒకవేళ ఎక్కడైనా ఆలస్యం జరిగితే అది ఎమ్మెల్యే సంతకం లేకపోవడం వల్లో, దరఖాస్తు చేయడంలో జాప్యం వల్లో లేదా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లో జరిగి ఉండవచ్చు. దీనిపై పూర్తి వివరాలను సభ ముందు ఉంచుతాం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రజలకు నీళ్లు ఇవ్వడం కోసం తెచ్చిందా? లేక పైపుల కంపెనీల ప్రయోజనం కోసం తెచ్చిందా అని అన్నారు. ఈ పథకం కోసం దాదాపు రూ. 40 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి, లక్షా 23 వేల కిలోమీటర్ల మేర పైపులు వేశామని లెక్కలు చెప్పారు. కానీ ఎక్కడో దూరం నుంచి నీళ్లు తెచ్చి, ఫిల్టర్ చేసి పంపిణీ చేసే విధానం క్షేత్రస్థాయిలో ఎక్కడా సక్రమంగా అమలు




కాలేదన్నారు. తెలంగాణలోని ఏ జిల్లాలో కూడా మిషన్ భగీరథ సక్రమంగా పనిచేయడం లేదు. ఎక్కడ చూసినా పైపుల లీకేజీలు, పగిలిన పైపులతో నీరు వృథా అవుతోంది కానీ ప్రజలకు మాత్రం అందడం లేదన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల నుంచి ఎర్రుపాలెం వరకు వేసిన పైప్‌లైన్ ద్వారా సరిగ్గా నీరు అందిన పరిస్థితి లేదు. కేవలం లీకేజీలు, మరమ్మతులతోనే కాలం గడుస్తోంది. కొత్త పథకం పేరుతో స్థానిక నీటి వనరులను నిర్లక్ష్యం చేయడమే కాకుండా, అప్పటికే పనిచేస్తున్న పాత నీటి పథకాలకు తాళాలు వేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. మిషన్ భగీరథ పనితీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధమైతే ఒక కమిటీ వేద్దాం. ఊరూరా తిరిగి నీటి పంపిణీ ఎలా జరుగుతుందో, క్షేత్రస్థాయి వాస్తవాలు ఏంటో ప్రత్యక్షంగా పరిశీలిద్దాం అన్నారు. ప్రతిపక్ష నేతలు సభను, ముఖ్యమంత్రిని మరియు మంత్రులను గౌరవించి మాట్లాడాలి. సభా మర్యాదలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం అవసరం అని గుర్తు చేశారు.

# నేడు రాష్ట్రాల సీఎంలతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

మొదటి తరువాయి

భారత్ అనుసరిస్తున్న విధానాలను వివరించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయా రాష్ట్రాల సన్నద్ధత, సహకారంపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశానికి దూరంగా ఉండనున్నట్లు తెలిసింది. అయితే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ సెక్రటరీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధాని-సీఎంల వీడియో కాన్ఫరెన్స్‌లో తీసుకున్న వివరాలను సీఎస్‌లకు వెల్లడించి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేలా కేబినెట్ సెక్రటరీ సూచించనున్నట్లు సమాచారం. ఇటీవల పార్లమెంటు ఉభయసభల్లో మాట్లాడిన ప్రధాని మోదీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇది పరీక్షా సమయమేనని తెలిపారు. సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల



ముఖ్యమంత్రులతో సమావేశానికి సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభంపై కీలక సూచనలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో చమురు, గ్యాస్‌పై విపరీతంగా వదంతులు వ్యాపిస్తున్నాయి. మధ్యప్రాచ్యం యుద్ధం కొనసాగితే.. ఎదురయ్యే ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై మోదీ దిశానిర్దేశర చేయనున్నారు. గత నెల 28 నుంచి పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా లీ ఖమేనీ హతమయ్యాడు. దీంతో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. గల్ఫ్ దేశాల్లోని ఇంధన, గ్యాస్ క్షేత్రాలపై క్షిపణులతో విరుచుకుపడింది. అంతేకాకుండా హోర్ముజ్ జలసంధిని కూడా మూసేసింది. దీంతో ప్రపంచ దేశాల్లో చమురు, గ్యాస్ కష్టాలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇప్పటికే ఆయా దేశాల్లో అత్యవసర పరిస్థితులు అమలు అవుతున్నాయి. అలాగే భారత్‌లో కూడా కరోనా కాలం నాటి లాక్‌డౌన్ పరిస్థితులు వస్తాయంటూ పుకార్లు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## ఆరోగ్యశ్రీపై అబద్దాలు చెప్పే ప్రయత్నం

మొదటి తరువాయి

తీసుకురాకుండా ప్రభుత్వం అడ్డుపడు తోందన్నారు. హరీశ్ రావు మాట్లాడుతూ.. 'ఆరోగ్యశ్రీ ఖర్చుల పెంపుపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. 2014 జూన్ 2 నాటికి ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.32 కోట్లు ఖర్చయ్యేవి. 2023 నాటికి ఇది రూ.68 కోట్లకు చేరుకుంది.



కానీ.. ప్రభుత్వం రూ.89 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతోంది. జనాభా పెరుగుదల, వైద్య ఖర్చుల పెరుగుదల దృష్ట్యా ఈ పెంపు సహజం, ఇందులో కాంగ్రెస్ కొత్తగా సాధించిన ఘనతేమీ లేదు. కాంగ్రెస్ వచ్చిన తర్వాతే ఆరోగ్యశ్రీ ఖర్చులు బాగా పెరిగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి, పనులు చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం జాప్యం చేస్తోంది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఆ ఆస్పత్రులన్నీ పూర్తై ప్రజలకు మెరుగైన సేవలు అందేవి. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు మరింత అండగా నిలవాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్సైజ్ అదాయంలో వాటాను పెంచి నిధులను సమకూర్చింది' అని అన్నారు.

--------

## కవిత కొత్త పార్టీ తెలంగాణ ప్రజా జాగృతి

మొదటి తరువాయి

జాగృతి కార్యాలయంలో నిర్వహించే అధికారిక సమావేశంలో 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో కొత్త పార్టీని ఆమె ప్రకటించనున్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకల తేదీని కూడా అదే వేదిక నుంచి వెల్లడించేందుకు సర్వం సిద్ధమైంది. రాబోయే నెలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పార్టీ జెండా, అజెండా , పార్టీ గుర్తును ప్రజల ముందుకు తీసుకురావాలని కవిత భావిస్తున్నారు. ఈ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పెద్ద ఎత్తున చేరికలు ఉండేలా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. కేవలం పార్టీ ప్రకటనకే పరిమితం కాకుండా, కవిత రాబోయే ఎన్నికల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనే అంశంపై కూడా ఈ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. గతంలో నిజామాబాద్ ఎంపీగా ఐదేళ్ల పాటు పనిచేసిన అనుభవం ఉండటంతో, అదే పార్లమెంట్ పరిధిలోని బోధన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆమె బరిలోకి దిగుతారని రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. కవిత ఈ కొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకోవడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలలో ఒక్కసారిగా గుబులు మొదలైంది. ముఖ్యంగా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ వంటి నేతలు కవిత నిర్ణయంతో ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. కవిత వెంట ఎంతమంది కీలక నేతలు నడుస్తారు, ఎంతమంది మాజీ ఎమ్మెల్యేలు ఆమె పార్టీలో చేరతారనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో మూడో ప్రత్యామ్నాయంగా ఎదిగే లక్ష్యంతో వస్తున్న ఈ కొత్త పార్టీ, భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ఏ విధంగా మారుస్తుందో వేచి చూడాలి.

# వారాల ఆనంద్ 'సంభాషణే సాహిత్యం' పుస్తకావిష్కరణ



**కరీంనగర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యార్థుల్లో సాహిత్య సృజనాత్మక చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని ప్రముఖ వైద్యులు, రచయిత డాక్టర్ మేకా విజయమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం జరిగిన సాహిత్య కార్యక్రమంలో ఆయన ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్ రచించిన "సంభాషణే సాహిత్యం" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇటీవల స్థానిక కార్ఖానాగడ్డ స్కూల్లో వారాల ఆనంద్ రచించిన "త్రివేణి" సంపుటి ఆవిష్కరణ సందర్భంగా విద్యార్థులతో జరిగిన ముఖాముఖి ప్రశ్న--జవాబు కార్యక్రమాన్ని సంకలనం చేసి ఈ గ్రంథాన్ని వెలువరించారు. ఈ సందర్భంగా విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, "టాగోర్ నుంచి ప్రారంభించి భారతీయ సాహిత్యకారుల ఆలోచనలను విద్యార్థులు లోతుగా గ్రహించాలి" అని సూచించారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ దారం రఘురామన్ మాట్లాడుతూ, "విద్యార్థుల్లో రచనా అభిలాషను ప్రోత్సహించాలి. వారే భవిష్యత్తు సమాజానికి దారులు వేస్తారు" అని అన్నారు. రచయిత వారాల ఆనంద్ మాట్లాడుతూ, "సంభాషణే సాహిత్యం" పుస్తక నేపథ్యం విద్యార్థి లోకానికి "చదవండి, అర్థం చేసుకోండి, జీర్ణించుకోండి" అనే నినాదాన్ని చేరవేయడమే అని వివరించారు. ఈ సమావేశంలో బి.వి.ఎన్. స్వామి, పి.ఎస్. రవీంద్ర, కె.ఎస్. అనంతాచార్య, మాడిశెట్టి గోపాల్, గాజుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విస్తృత సాహిత్య చర్చ జరిగింది.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కనగల్ మండల కేంద్రంలో రూ.6 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యాభివృద్ధి ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కొత్త కళాశాల భవనం నిర్మాణం పూర్తయిన తర్వాత స్థానిక విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ఉన్నత విద్యను కొనసాగించేందుకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని అన్నారు. నిర్మాణ పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేసి త్వరగా విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, అదనపు కలెక్టర్, మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, స్థానిక సర్పంచ్ నర్సింగ్ మురళీధర్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

# బాలల పరిరక్షణ మనందరి బాధ్యత

- తీదేడు గ్రామంలో" మిషన్ వాత్సల్య పథకం "బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం.
- ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి .
- తీదేడు గ్రామ సర్పంచ్ (బాలల పరిరక్షణ కమిటీ ఛైర్మన్)



**దేవరకొండ మార్చి 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** బాలల పరిరక్షణ మనందరి బాధ్యతని తీదేడు గ్రామ సర్పంచ్ గ్రామ బాలల పరిరక్షణ కమిటీ ఛైర్మన్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...బాల బాలికలను అన్ని రంగాలలో ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరు సహాకరించాలని ఆమె అన్నారు. బాల్య వివాహాలు జరుగకుండా ప్రతి ఒక్కరు చూడాలని ఆమె అన్నారు. బాలలందరు బడికి వెళ్ళేలా, బాల కార్మికులు లేకుండా, బాలలపై ఎలాంటి వేధింపులు జరుగకుండా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. బాలల సంక్షేమ కోసం ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు, ఉలుపాల శేఖర్ రెడ్డి, సోనగంటి గొవర్ధనాచారి, వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్, సందె లక్ష్మయ్య, మర్ల యాదగిరి, ఐ.సి.పి.యస్ సభ్యులు రాము, అంగన్వాడి సూపర్వైజర్ ప్రసన్న లక్ష్మి, అంగన్వాడి టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

-- కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలి: యం.డి. సలీం



**తిప్పర్తి, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఐకెపి వివోఏల సమస్యలను పరిష్కరించి, వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26,000 నిర్ణయించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి యం.డి. సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తిప్పర్తి మండలంలో జరిగిన వివోఏల మండల విస్తృత సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, "వివోఏల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వెంటనే స్పందించి వారి డిమాండ్లపై చర్చలు జరిపి పరిష్కరించాలి. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవు" అని హెచ్చరించారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించి, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వివోఏలకు సీసీలుగా ప్రమోషన్లు కల్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పెంజర్ల సైదులు, వివోఏ జిల్లా నాయకురాలు మంత్రాల మంగమ్మ, మండల అధ్యక్ష--కార్యదర్శులు యం.డి. రూమాణ, జక్కుల అనిత, నాయకులు ఎలుక కోటిరెడ్డి, సైదులు, మల్లయ్య, సంధ్య, సామ్రాజ్యం, స్రవంతి, సునీత, రమణ, నాగరాజు, సువర్ణ, రాణి, జయమ్మ, అశ్విని, కాసింబి, రేణుక, వసంత, లక్ష్మి, పుష్ప, వసుమతి, నాగమ్మ, అన్నపూర్ణ, విజయ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యా విధానంపై స్పష్టత ఇవ్వాలని కోరిన విద్యా పరిరక్షణ కమిటీ



**హైదరాబాద్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రతినిధులు గురువారం ఉన్నత స్థాయి విద్యా కమిటీ చైర్మన్ కె. కేశవరావుతో సమావేశమై రాష్ట్ర విద్యా విధానంపై తమ ప్రతిపాదనలను చర్చించారు. ప్రభుత్వం ఇప్పటివరకు విద్యా విధానం అమలు విషయంలో స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో, కేంద్రం ప్రవేశపెట్టిన చీజ్రూ 2020, విద్యా హక్కు చట్టం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ అంశాలను చర్చకు తెచ్చి సమాజాన్ని గందరగోళానికి గురి చేస్తోందని కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా బడ్జెట్ తక్కువగా కేటాయించడం, ప్రైవేట్ విద్యారంగం రోజురోజుకు బలోపేతం కావడం వల్ల సామాన్య ప్రజలు ఫీజుల భారంతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యా విధానంపై స్పష్టత ఇవ్వాలని, ప్రజలకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకోవాలని కమిటీ కోరింది. ఈ సందర్భంగా వారు పలు సూచనలు చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ--ప్రైమరీ తరగతులు ప్రవేశపెట్టడం, విద్యారంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయించడం, ఉపాధ్యాయులను విద్యేతర కార్యక్రమాల నుండి మినహాయించడం, ప్రైవేట్--కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించడం, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయడం, యు.కె. ప్రైవేట్ పాఠశాలలకు అనుమతి ఇవ్వకపోవడం, నాలుగేళ్ల డిగ్రీ విధానాన్ని అమలు చేయకపోవడం, విశ్వవిద్యాలయాలకు కనీసం 100 కోట్ల బడ్జెట్ కేటాయించడం, కాంట్రాక్ట్ లెక్చరర్లకు అసిస్టెంట్ ప్రొఫెసర్ స్కేల్స్ అమలు చేయడం, ఖాళీగా ఉన్న టీచింగ్--నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. ఈ ప్రతిపాదనలపై కె. కేశవరావు సానుకూలంగా స్పందించారు. సమావేశంలో కమిటీ అధ్యక్షుడు కే. చక్రధరరావు, ప్రధాన కార్యదర్శి జి. హరగోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శి కే. లక్ష్మీనారాయణ, టిపిటిఎఫ్ అధ్యక్షుడు సిహెచ్. అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్, డిటిఎఫ్ అధ్యక్షుడు ఎం. సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి, ట్రీటా ప్రతినిధులు కే. రవిచంద్ర, కె. వేణుగోపాల్, వై. అశోక్‌కుమార్, రామకృష్ణ, సుబ్బారావు, ఎం. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో భాగంగా నూతన సిసి రోడ్ ప్రారంభోత్సవం



**అమ్రాబాద్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అమ్రాబాద్ మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ మల్కమామిడి గ్రామంలో నూతన సిసి రోడ్డును గ్రామ సర్పంచ్ శాంతమ్మ ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సహకారంతో సాధ్యమైందని గ్రామ ప్రజలు తెలిపారు. డిప్యూటీ సర్పంచ్ జీవన్ రెడ్డి అభ్యర్థనపై వెంటనే స్పందించి రహదారి మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యు ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్, తాలూకా అధ్యక్షుడు లడ్డు యాదవ్, వార్డు సభ్యులు బుచ్చమ్మ, అంజి, మాజీ వార్డు సభ్యుడు ఓంకారం, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అంజి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అశోక్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, రమేష్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# శాంతి, సామరస్యమే లక్ష్యం - సీఐ వెంకటేశ్వర్లు

- పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుందాం



**ఆమనగల్లు, మార్చి 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సమాజంలో శాంతి, సామరస్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం మరియు ఇతర మతాల పెద్దలు, కుల పెద్దలు, ప్రజాప్రతినిధులు శ్రీరామనవమి పండుగ నేపథ్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఉగాది, రంజాన్ పండుగలు ప్రశాంతంగా జరిగినట్లే రాబోయే శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, బక్రీద్ తదితర పండుగలను కూడా పరస్పర గౌరవం, మతసామరస్యంతో జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్ సభ్యులు పాపిశెట్టి రాము, ఎర్రవోలు మహేష్, మొక్తల వెంకటయ్య, ఎస్ఐ సీతారాం రెడ్డి, ఏఎస్ఐ రాంరెడ్డి మరియు ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, ఖాదర్ ఖాద్రి, శ్రీను నాయక్, ఎంగలి ప్రసాద్, టిల్లు శివ, వంశీ, పాతకోట శ్రీశైలం, నరేష్, శ్రీను నాయక్, రమేష్, అరుణ్, శివ తదితరులు ఉన్నారు.

# వంద శాతం పన్ను వసూళ్లపై దృష్టి

**పెద్దపల్లి, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామాల్లో 100% పన్ను వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీ శాఖపై సమీక్ష నిర్వహించిన ఆయన, ప్రతి నిర్మాణం అసెస్మెంట్ పూర్తి చేసి ప్రతి ఇంటి నుంచి ఆస్తి పన్ను తప్పనిసరిగా వసూలు చేయాలని సూచించారు. అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలకు వెంటనే నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. వ్యాపార సంస్థల పూర్తి వివరాలు అందుబాటులో ఉండాలని, పన్ను చెల్లించని రైస్ మిల్లర్లు, వాణిజ్య సంస్థలను మూసివేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీ కార్యాలయాలు కూడా పన్ను చెల్లించాల్సి ఉంటుందని, పెండింగ్ ఉన్నవారికి డిమాండ్ నోటీసులు ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, రోడ్లపై చెత్త ఉండకుండా చర్యలు తీసుకోవాలని, మద్యం షాపుల వద్ద చెత్త ఉంటే భారీ జరిమానాలు విధించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏప్రిల్ 2న



గ్రామ సభకు పటిష్ట ఏర్పాట్లు చేసి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులు, ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ప్రజలకు వివరించాలని సూచించారు. ఏప్రిల్ 16న మండల స్థాయిలో స్వశక్తి మహిళా సంఘాల బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీ, వ్యవసాయ యాంత్రీకరణ, ఆస్తుల పంపిణీ, అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజాప్రతినిధులను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, డీఎల్పీఓలు, ఎంపీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమం



**పెద్దపల్లి, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెనుగువాడలోని ప్రైమరీ పాఠశాల, అంగన్వాడి కేంద్రంను 18వ వార్డు కౌన్సిలర్ కొలిపాక సంపత్ పరిశీలించారు. ప్రైమరీ పాఠశాలలో పిల్లలు ఆడుకునే స్థలాన్ని పరిశీలించి, అవసరమైన నిర్మాణం చేపడతానని ప్రధానోపాధ్యాయులకు హామీ ఇచ్చారు. అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించి, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. రాబోయే రోజుల్లో పాఠశాల, అంగన్వాడి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను అందించేందుకు ముందుండి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, అంగన్వాడి ఉపాధ్యాయురాలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి శోభాయాత్రపై పీస్ కమిటీ సమావేశం



**పెద్దపల్లి, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శ్రీరామనవమి శోభాయాత్రను పురస్కరించుకొని పెద్దపల్లిలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం జరిగింది. పట్టణంలో సర్వమత పెద్దలు, ప్రముఖులు, నాయకులు పాల్గొన్న ఈ సమావేశంలో శాంతి, సోదరభావంతో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయాలు తీసుకున్నారు. పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, ఏసీపీ జి. కృష్ణ, సీఐ కె. ప్రవీణ్ కుమార్, ఎస్ఐ జె. లక్ష్మణ్ రావు సమావేశంలో పాల్గొన్నారు. గతంలో మాదిరిగా ఎలాంటి గొడవలకు తావు లేకుండా అందరూ పోలీసులకు సహకరించాలని డీసీపీ సూచించారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయుడికి జాతీయ పురస్కారం

**పెద్దపల్లి, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
విద్యారంగంలో రాణిస్తూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణలో విశేష కృషి చేస్తున్న పెద్దపల్లి జిల్లా రామగుండం మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గూళ్ల అంజన్ కుమార్‌కు ప్రొఫెసర్ జయశంకర్ జీవన సౌఫల్య జాతీయ పురస్కారం ప్రధానం చేశారు. వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్, వసుంధర విజ్ఞాన వికాస మండలి 33వ వార్షికోత్సవంలో తెలంగాణ భాషా శాశ్వత శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈ అవార్డును అందజేశారు. గూళ్ల అంజన్ కుమార్ తెలంగాణ జీవశాస్త్ర ఫోరం జిల్లా అధ్యక్షుడిగా, నేషనల్ గ్రీన్ క్రాప్స్ జిల్లా కోఆర్డినేటర్‌గా, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా, సామాజిక సేవా కార్యకర్తగా, ఎన్నికల మాస్టర్



ట్రైనర్‌గా, పర్యావరణ విద్యా బ్రాండ్ అంబాసిడర్‌గా, విద్యార్థుల మోటివేటర్‌గా విశేష సేవలు అందిస్తున్నారు. జాతీయ పురస్కారం అందుకున్న సందర్భంగా పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# జనగణన కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జనగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. జనగణన 2027లో భాగంగా తొలిదశలో చేపట్టనున్న హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్‌పై సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జనగణనలో ప్రతి కుటుంబం తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని, తప్పుడు వివరాలు అందించినా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఎన్యుమరేటర్లకు పూర్తి అవగాహన ఉండాలని, అందించిన మేటీరియల్‌ను పునఃపఠనం చేయాలని సూచించారు. జనగణన సాఫ్ట్‌వేర్ పని తీరు, డేటా సేకరణ విధానం, డిజిటల్ పరికరాల వినియోగం, ఫీల్డ్ స్థాయిలో జాగ్రత్తలు వంటి అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం దేశ అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పనలో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. మే 11 నుంచి జనగణన కార్యక్రమం ప్రారంభమయ్యే అవకాశం ఉందని, జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మండల, మున్సిపల్ ఎంపీఎస్ఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యేలకు క్రీడల పోటీలు

**హైదరాబాద్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తి చాటిచెప్పేందుకు తొలిసారిగా శాసనసభ్యుల క్రీడా పోటీలు నిర్వహించబోతున్నట్లు మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ పోటీల నిర్వహణ కమిటీ ఆర్గనైజింగ్ కన్వీనర్‌గా రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 28, 29 తేదీల్లో జరగబోయే మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్--2026 సన్నాహక సమావేశం అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజకీయాల్లో బిజీగా ఉండే శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు ఈ పోటీలు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగించడమే కాకుండా రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని



పెంపొందించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఈ పోటీలు నిర్వహించబడుతున్నాయని, పార్టీల బేధాభిప్రాయాలు పక్కన పెట్టి అన్ని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు పాల్గొనబోతున్నారని పేర్కొన్నారు. శాసనసభ సచివాలయం, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖతోపాటు వివిధ విభాగాల సమన్వయంతో క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్--2026 ప్రారంభోత్సవం మార్చి 28న మధ్యాహ్నం 3.30 గంటలకు ఎల్బీ స్టేడియంలో జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉభయ సభల పక్ష నేతలు, విప్‌లు, అన్ని పార్టీల శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు హాజరుకానున్నారు.

# నర్సాపూర్‌లో ఎల్లమ్మ సినిమా సందడి

**ఎలిగేడు, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని నర్సాపూర్ గ్రామంలో గురువారం ఎల్లమ్మ సినిమా షూటింగ్ సందడిగా జరిగింది. బలగం సినిమా దర్శకుడు ఎలదండి వేణు నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ చిత్రంలోని ఒక భాగాన్ని గ్రామంలోని అంబేద్కర్ సంఘం భవనం వద్ద చిత్రీకరించారు. సినిమా బృందం నర్సాపూర్‌కు చేరుకోవడంతో గ్రామ సర్పంచ్ పల్లెర్ల వెంకటేశ్ గౌడ్ స్వాగతం పలికారు. గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కూడా షూటింగ్ తీరును ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లెర్ల వెంకటేశ్ గౌడ్, ఉపసర్పంచ్ రవి, వార్డు సభ్యులు, గ్రామస్థులు, ఎల్లమ్మ సినిమా బృందం పాల్గొన్నారు.




# అంగన్వాడీ కేంద్రంలో ఉచిత పాఠశాల మేళా



**కొత్తపల్లి, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్ అంగన్వాడీ కేంద్రంలో ప్రీ పాఠశాల మేళా నిర్వహించారు. కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్‌లో భాగంగా సక్షం అంగన్వాడీ పథకం కింద 35 ఆర్ఓ ప్లాంట్లు మంజూరైన నేపథ్యంలో మల్కాపూర్--1,2 అంగన్వాడీలలో ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ కాంతల జగన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సబిత తల్లులకు అవగాహన కల్పించారు. పిల్లలు పాటలు, కథలు చెప్పి ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్పొరేటర్ జగన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ రాజేందర్ పిల్లలకు ఐదు అభివృద్ధి అంశాలపై ఆటలు ఆడించి, వాటి గురించి వివరించారు. అనంతరం పిల్లలకు రిపోర్ట్ కార్డులను సీడీపీఓ సబిత, కార్పొరేటర్ జగన్ రెడ్డి, సూపర్వైజర్ స్వప్న అందజేశారు. ఈ కార్యక్రమంలో టీచర్లు సుప్న, హేమలత, లావణ్య, ఏఎన్ఎం సరస్వతి, అరుణతో పాటు తల్లిదండ్రులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో నిందితునికి నాలుగు నెలల జైలు శిక్ష



**పాలకుర్తి, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గత జనవరి నెలలో పాలకుర్తి మండలం బసంతనగర్ కోదండరామాలయంలో గుడి తలుపులు, తాళాలు పగులగొట్టి దేవుడి నగలు దోచుకెళ్లిన తన్నీముట్టి సాయి అనే దొంగకు గురువారం గోదావరిఖని కోర్టు నాలుగు నెలల జైలు శిక్షతో పాటు వంద రూపాయల జరిమానా విధించింది. ఈ కేసులో బసంతనగర్ ఎస్ఐ నూతి శ్రీధర్ వేలిముద్రలు సేకరించి దర్యాప్తు జరిపి నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తును వేగవంతం చేసి ఛేదించిన పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ నూతి శ్రీధర్, కోర్ట్ కానిస్టేబుల్ ఎన్. రమేష్‌లను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.


# రేషన్ బియ్యం మాయం

-- రీ పాలిష్ దందా బహిర్గతం



**కరీంనగర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిటీ శివార్లలోని మూడు రైస్ మిల్లుల్లో రీ--పాలిష్ దందా బయటపడింది. ఏకంగా 1,200 టన్నుల పిడిఎస్ బియ్యం మాయం కావడం వెనుక బడా బాబుల హస్తం ఉన్నట్లు ఇంటర్నల్ రిపోర్ట్ సిఎస్/2026/04'5లో తేలింది. ఇంత భారీ స్కామ్ వెలుగులోకి వచ్చినా కేసులు నమోదు చేయకుండా కేవలం జరిమానాలతో సరిపెట్టేందుకు తెర వెనుక రాజకీయ ఒత్తిళ్లు మొదలయ్యాయని సమాచారం. అధికారుల అండతోనే ఈ అక్రమ రవాణా నెట్వర్క్ నడుస్తోందని తాజా రిపోర్టులు చెబుతున్నాయి.

## శ్రీరామ నవమి సందర్భంగా శ్రీసీతారాముల కళ్యాణానికి ఏర్పాట్లు పూర్తి



**ఎలిగేడు, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎలిగేడు శ్రీకోదండరామాలయం, రాములపల్లి శ్రీనాగలింగేశ్వరాలయం, సుల్తానాపూర్ శ్రీసీతారామచంద్ర ఆలయం, ధూళికట్ట శివాలయం, లాలపల్లి శ్రీమల్లికార్జున స్వామి ఆలయ ఆవరణలో కళ్యాణ మహోత్సవం జరుగనుంది. ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్జీవో నాయకులు



**కరీంనగర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ఎన్జీవో సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిగా సంగెం లక్ష్మణరావు ఎన్నికైన అనంతరం తొలిసారిగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఐఏఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొత్తగా ఎన్నికైన సంఘ నాయకులను అభినందించారు. ఉద్యోగుల సమస్యలు, సంక్షేమం కోసం సంఘం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని నాయకులు తెలిపారు. రాబోయే రోజుల్లో సంఘ ప్రతిష్టను పెంచేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్జీవో సంఘం క్రమశిక్షణతో కూడిన సంస్థగా మంచి పేరు సంపాదించిందని, ప్రజలతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ఇరువురూ కలిసి పనిచేయాలని సూచించారు. ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర నాయకులు సర్దార్ హర్మీందర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, నాయకులు రమేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఇరుమల్ల శారద, సబిత, విజయలక్ష్మి, సుస్మిత, కరుణ, పవన్ కుమార్, అక్బర్ అలీ, కమలాకర్, కరుణాకర్, కయ్యం శ్రీనివాస్, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో ప్రజా పాలన

--ప్రగతి ప్రణాళిక కార్యక్రమం



**తిమ్మాపూర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన-- ప్రగతి ప్రణాళికలో భాగంగా తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ, పి.ఓ.ఎం హెచ్.ఎన్. డాక్టర్ సనా జవేరియా కలిసి శిబిరాన్ని సందర్శించి ప్రజా ఆరోగ్య సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితులను పరీక్షించుకోవాలని, ఉచితంగా మందులు పొందాలని, ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని అధికారులు సూచించారు. గర్భిణీ స్త్రీలు పీహెచ్‌సీ అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని ప్రత్యేకంగా కోరారు. శిబిరంలో మాతా--శిశు సంరక్షణ, కౌమారదశ బాలికల ఆరోగ్య పరీక్షలు, వృద్ధుల వైద్య సేవలు, రక్తహీనత నిర్ధారణ, 30 ఏళ్ల పైబడిన వారికి బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. క్షయ, ఎయిడ్స్ వంటి వ్యాధులకు నిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యక్షంగా ఉన్నత సేవలు అందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రసిల్లా, సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ సమక్షంలో ఘనంగా రామోత్సవం



**గోదావరిఖని, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి--దుర్గా వాహిని ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు కాలనీలో రామోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 50 మంది మహిళలు, డివిజన్ కార్పొరేటర్ నిర్మలాదేవి, పురోహిత జగదీశ్వర చారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చారి రామాయణ గాథను వివరించి, దైనందిన జీవితంలో దానిని ఎలా ఆచరించాలో విపులంగా చెప్పారు. మాత, భూమాత, గోమాతల ప్రాధాన్యం, సీతామాత ఓర్పు, సహనాల గురించి విశదీకరించారు. డివిజన్ కార్పొరేటర్ నిర్మలాదేవి మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్క హిందువు భాగస్వామ్యం కావాలని సూచించారు. పరిషత్ కార్యక్రమాలకు తాను సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ వేడుకలో నగర సంయోజక భవాని, సహ సంయోజక వీణ, ఇందిరా, ఉపాధ్యక్షురాలు లలిత, సత్సంగ్ సేవా ప్రముఖ కమలమ్మ, జిల్లా సంయోజక తిరుమల, నగర సత్సంయోజిక స్వాతి, కార్యకర్త రమ్య తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీపూర్ పీహెచ్‌సీ సెంటర్‌లో మెగా హెల్త్ క్యాంప్



**మానకొండూర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక శిబిరాన్ని లక్ష్మీపూర్ సర్పంచ్ ఎడ్ల సత్యనారాయణ, ఉప సర్పంచ్ రాపాక ప్రవీణ్ ప్రారంభించారు. గ్రామస్తులు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వైద్య సేవలను పొందారు. ఈ శిబిరంలో స్త్రీల వైద్య నిపుణులు డా. సౌమ్య, పిల్లల వైద్య నిపుణులు డా. వినీత్ కుమార్, కంటి వైద్య నిపుణులు డా. ఎండి హారిస్, ఎముకల వైద్య నిపుణులు డా. భరత్ రాజ్, దంత వైద్య నిపుణులు డా. రాజి రెడ్డి, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణుడు డా. వెంకట భరద్వాజ్ సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాపాక మధుకర్, నగునూరి సంపత్, ఎర్ర అనిల్, ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక పనులు కాంగ్రెస్ ప్రభుత్వం చేయదు - ప్రణవ్



**హుజురాబాద్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** డంపింగ్ యార్డ్ సమస్యపై ఇప్పటికే మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో ముఖ్యమంత్రిని కలిసి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. ప్రజలకు హాని చేసే పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ చేయదని ఆయన స్పష్టం చేశారు. గత మూడు రోజులుగా అఖిలపక్షం ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన దీక్షలకు సంఘీభావం తెలుపుతూ అంబేద్కర్ కూడలిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రణవ్, డంపింగ్ యార్డు వలన ప్రజలకు తలెత్తే సమస్యలను అధికారులకు వివరించామని చెప్పారు. ఈ సమస్య పార్టీలకు అతీతమని, హుజురాబాద్ భవిష్యత్తు కోసం అందరూ కలిసి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అపర భద్రాద్రిగా పేరు గాంచిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరగబోయే కళ్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రణవ్ తెలిపారు. వేసవి దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చలవపందిళ్లు, త్రాగునీటి వసతి కల్పించామని చెప్పారు. కళ్యాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారని, జమ్మికుంట నుండి ఇల్లందకుంట వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. రైస్ మిల్లర్లు, కాటన్ మిల్లర్ల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందని, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా భక్తులకు ప్రతి సంవత్సరం ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్న రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యమకారుల అసెంబ్లీ ముట్టడి విజయవంతం చేయాలి

- ఓరుగంటి ఆనంద్

**హుస్నాబాద్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం మార్చి 30న జరగనున్న అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్, జిల్లా అధ్యక్షుడు కనకం కుమారస్వామి ఆదేశాల మేరకు రాష్ట్ర నాయకులు గోవిందు వెంకటేశం, హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని మండలాల ఉద్యమకారులు పెద్ద ఎత్తున పాల్గొని అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమకారులను స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించి వారికి తగిన గౌరవం, హక్కులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఉద్యమకారులకు సరైన గుర్తింపు రాలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాల ఫలితంగా ఏర్పడినప్పటికీ, వారికి న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో ఉద్యమకారులను గుర్తించడానికి కమిటీ వేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర నలుమూలల నుండి ఉద్యమకారులు పార్టీలకు అతీతంగా భారీగా తరలి వచ్చి అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# విజయవంతంగా ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



**కరీంనగర్ రూరల్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన వివేకానంద డిగ్రీ మరియు పీజీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నగునూరు గ్రామంలో నిర్వహించిన ఏడు రోజుల ప్రత్యేక శిబిరం నేటితో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఏడు రోజుల పాటు శ్రమదానం, పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలు, సామాజిక అవగాహన ర్యాలీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు ఇలాంటి శిబిరాల్లో పాల్గొనడం ద్వారా సేవాభావాన్ని పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ మాట్లాడుతూ, వాలంటీర్లు సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి కృషి చేయాలని, రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్, ఏసీ ఓబి సంపత్ కుమార్, ఏఓబి శ్రవణ్ కుమార్, మాజీ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆర్. గోపి కృష్ణ, డాక్టర్ ఎండి. అలీ ఖాన్, ప్రోగ్రాం అధికారులు డి. సాగర్, బి. మహేష్, ఎన్. శ్రీనివాస్, డాక్టర్ ఎంఎ. సలీం, అధ్యాపక బృందం మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.


# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు





**కరీంనగర్ రూరల్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చేగుర్తి గ్రామానికి చెందిన పోతురాజుల కోటి, బొమ్మకల్ గ్రామానికి చెందిన సుద్దాల పరశు రాములు అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా దుర్షేడ్ గ్రామంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఇకపై ఎవరైనా అక్రమ ఇసుక రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే అక్రమంగా రవాణా చేసి మరలా పట్టుబడినట్లయితే వారి వాహనాలను సీజ్ చేసి వేలం వేయడానికి కోర్టు, ఆర్టీవో, మైనింగ్ శాఖకు అప్పగిస్తామని తెలిపారు. మొదటిసారి పట్టుబడిన వారిని ఎమ్మార్వో ముందు బైండ్ ఓవర్ కొరకు హాజరుపరుస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ ఇసుక రవాణాను సహించేది లేదని స్పష్టం చేశారు. ఇసుక రవాణా మానుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పెట్రోల్, డీజిల్ కొరత లేదని తెలిపిన బంకు యజమానులు



**పాలకుర్తి, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాలకుర్తి మండలంలోని నాలుగు పెట్రోల్ బంకుల్లో ఇంధన కొరత లేదని బంకు యజమానులు తెలిపారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు స్టాక్‌ను పుష్కలంగా నిల్వ చేస్తున్నామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో కొంతమంది ఇరాన్, ఇశ్రాయేల్, అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధాన్ని కారణంగా చూపుతూ బంకుల్లో స్టాక్ లేదని బోర్డులు పెట్టారని ప్రచారం చేయడం వాస్తవం కాదని, ఇది కేవలం దుష్ప్రచారమేనని డీలర్లు స్పష్టం చేశారు. మండలంలో ఇప్పటి వరకు పెట్రోల్, డీజిల్ కొరత అనేది లేదని, వినియోగదారులు ఎలాంటి అపోహలకు గురై తొందరపడవద్దని బంకు యజమానులు తెలిపారు.

# మోహన్ రెడ్డి సేవలను స్మరించిన నాయకులు



**హుస్నాబాద్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కీ.శే. కామ్రేడ్ అయిలేని మోహన్ రెడ్డి 30వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మోహన్ రెడ్డి ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన నిజాయితీ గల నాయకుడని కొనియాడారు. ఆయన సేవలను ప్రజలు ఎప్పటికీ మరువలేరని తెలిపారు. హుస్నాబాద్ ప్రాంతంలో భారత కమ్యూనిస్ట్ పార్టీలో చేరి దాదాపు 25 సంవత్సరాల పాటు ప్రజా సేవలో నిరంతరం పనిచేసిన ఆయన కార్మిక సంఘాలకు నాయకత్వం వహిస్తూ కార్మిక సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. ఆయన కుమారుడు అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ తమ తండ్రి ప్రజల కోసం నిజాయితీగా పనిచేసినా అప్పటి పీపుల్స్ వార్ పార్టీకి చెందిన కొందరు నాయకులు వాస్తవాలు తెలుసుకోకుండా పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా చిత్రీకరించి అన్యాయంగా హత్య చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ప్రజల హృదయాల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ మోహన్ రెడ్డి మరణం హుస్నాబాద్ ప్రాంతానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూద్దాల చంద్రయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ. అన్వర్ పాషా, మాజీ సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, బీఎస్పీ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, సీపీఐ నాయకులు కొయ్యడ కొంరయ్య, సీపీఎం నాయకులు గుగులోతు శివరాజ్, టీడీపీ నాయకులు వరియోగుల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ బొజ్జ హరీష్, నాయకులు సూరంపెల్లి పరుశరాములు, యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, కందుకూరు సతీష్, బత్తుల జగ్జీవన్, మంద జానకిరామ్ రెడ్డి, బండి రమణా రెడ్డి, గుగులోతు తిరుపతి నాయక్, బత్తుల రవీందర్, గుగులోతు భాస్కర్ నాయక్, బొడ్డు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం



**మంచిర్యాల, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** బెల్లంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో జరిగిన బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్నులు, ఇతర పన్నులను 100 శాతం వసూలు చేయాలని, సిబ్బందికి సకాలంలో వేతనాలు అందించాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణకు డీఎంఎఫ్‌టి నిధుల ద్వారా ఆటోలు అందించామని, సి.ఎస్.ఆర్. నిధుల ద్వారా 2.50 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం, సోలార్ లైటింగ్ ఏర్పాటు, త్రాగునీటి సరఫరా వంటి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. 2026--27 సంవత్సరానికి 32.42 కోట్ల రూపాయల బడ్జెట్‌కు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారని, ఇందులో 4.77 కోట్ల రూపాయలు సాధారణ ఆదాయం, 26.28 కోట్ల రూపాయలు గ్రాంట్లు, 81 లక్షల రూపాయల డిపాజిట్లు, 55 లక్షల రూపాయల నిల్వలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ, 34 వార్డులలో ఒక సంవత్సరంలో మురికివాడలను పూర్తిగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మందమర్రి మండలం తిమ్మాపూర్ ప్రాంతంలో జాతీయ రహదారి 63 విస్తరణ పనులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణ, రహదారులు, మురుగు కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. నస్పూర్ మండల కేంద్రంలో బాలసదనం భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. మిషన్ వాత్సల్య నిధులతో 1.34 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం జరుగుతుందని, పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు.

# దత్తత గ్రామాలకు చలివేంద్రాల ఏర్పాటు లేక అసంతృప్తి




**పాలకుర్తి, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాలకుర్తి మండలం బసంతనగర్ అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ దత్తత గ్రామాలైన పాలకుర్తి, ఈశాల తక్కల్లపల్లి, కొత్తపల్లి, రామారావుపల్లి గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ పరిధిలోని బసంతనగర్ గ్రామంలో మాత్రమే ముఖ్య కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయగా, నిరంతరం కాలుష్య సమస్యలతో బాధపడుతున్న దత్తత గ్రామాలను విస్మరించడం సరైనదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కంపెనీ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు లభించి అభివృద్ధి జరుగుతుందని ఆశించి తక్కువ ధరలకు భూములు ఇచ్చిన గ్రామాలకు కనీసం తాగునీటి సదుపాయం కల్పించకపోవడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ, గతంలో కేశోరాం కంపెనీగా ఉన్నప్పుడు వేసవి ప్రారంభం కాగానే దత్తత గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతిరోజూ అంబలి, చల్ల, గొడుగులు పంపిణీ చేసేవారని గుర్తు చేసుకున్నారు. అల్ట్రాటెక్ కంపెనీగా మారిన తర్వాత సీఎస్ఆర్ నిధుల ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను విస్మరించారని ఆరోపించారు. ఇప్పటికైనా కంపెనీ అధికారులు స్పందించి దత్తత గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఆరుట్ల గ్రామభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం మరువలేనిది

-ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ మాజీ సర్పంచ్ అనంగల్ల యాదయ్య
-ఆరుట్ల గ్రామానికి తాజాగా రూ.90 లక్షల నిధులు మంజూరు



**ఇబ్రహింపట్నం , మార్చి 26( నీలగిరి ఎక్స్ ప్రెస్) :** మంచాల మండలం ఆరుట్ల గ్రామాభివృద్ధికి ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారం మరువలేనిదని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ ఆరుట్ల మాజీ సర్పంచ్ అనంగల్ల యాదయ్యలు అన్నారు. గురువారం ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షులు నూకం బాలరాజు ఆధ్వర్యంలో గ్రామానికి మంజూరైన సీసీ రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక చొరవతో హెచ్ఎండిఏ నిధులతో ఆరుట్ల గ్రామానికి తాజాగా రూ. 90 లక్షల నిధులు సీసీ రోడ్ల నిర్మాణం కోసం మంజూరు అయ్యాయని అన్నారు . ఆరుట్ల గ్రామానికి ఎమ్మెల్యే అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు మంజూరు చేస్తున్నారని రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే సహకారంతో సీసీ రోడ్లకు డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాల కొరకు మరిన్ని నిధులు తీసుకొచ్చి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతామని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎండి ఇమ్రాన్ ,అనంగల్ల జగన్నాదం ,కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్ ,అంతటి రాజుగౌడ్, వెదిరే రమణారెడ్డి ,దాసరమోని రమేష్ ,చెరుకు నర్సింహా ,బుట్టి కృష్ణ ,కంబాలపల్లి బుగ్గరాములు, మార లక్ష్మణ్ ,ఎన్నిదుల సురేష్, పొలామోని అనిల్ రాజు ,నూకం మల్లేష్ ,బుట్టి జంగయ్య , జిలమోని శ్రీనివాస్ , ఆర్ల శ్రీకాంత్, దాసరమోని అశోక్ ,ఎండి గాలేబ్, భాస్కర్ రైనా ,ఆడెపు మధు, నూకం శేఖర్ ,బుస్సు రాజు తదితరులు ఉన్నారు.

# ఘనంగా కామ్రేడ్ బొమ్మగాని ధర్మ బిక్షం వర్ధంతి

**కరీంనగర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పేదల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత నాయకుడు కామ్రేడ్ బొమ్మగాని ధర్మ బిక్షం 15వ వర్ధంతి సందర్భంగా గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ గీతా పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలపట్ల రాజుగౌడ్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ప్రవేశించి ప్రజా చైతన్యం కలిగించిన ధర్మ బిక్షం నిజాయితీ, త్యాగం, పోరాటం ప్రతీకగా నిలిచారని అన్నారు. 1922లో సూర్యాపేటలో జన్మించిన ఆయన, ఆర్య సమాజం ఆధ్వర్యంలో విద్యార్థి హాస్టల్ స్థాపనలో కీలక పాత్ర పోషించారని, అప్పటి కొత్వాల్ రాజ్ బహదూర్ వెంకట్రామిరెడ్డి ఆయనను "ధర్మ బిక్షం" అని సంబోధించడం



ద్వారా ఆ పేరు స్థిరపడిందని గుర్తు చేశారు. నల్లగొండ జిల్లాలో తొలి కార్మిక సంఘం, కమ్యూనిస్టు సెల్ స్థాపించిన ఘనత ఆయనకే దక్కిందని, మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా పనిచేసి పీడిత ప్రజల గొంతుకగా నిలిచారని తెలిపారు. గీతా కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోతాయని, దున్నేవాడిదే భూమి -- గీసేవాడిదే చెట్టు అన్న నినాదంతో కార్మికుల హక్కుల కోసం పోరాడారని పేర్కొన్నారు. 2011 మార్చి 26న 89 ఏళ్ల వయసులో ఆయన తుది శ్వాస విడిచినా, ప్రజా పోరాటాలకు అడ్డమై, వివాహం చేసుకోకుండా ప్రజల మనిషిగా జీవించిన ధర్మ బిక్షం అందరికీ ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, గీతా పనివారల సంఘం సభ్యులు పైడిపల్లి రాజుగౌడ్, బుర్ర చంద్రశేఖర్ గౌడ్, బూడిద సదాశివ, బాకం ఆంజన్న, ఆర్. అశోక్, రామ్మూర్తి, బుల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

# శాతవాహన విశ్వవిద్యాలయంలో డిజిటల్ పరివర్తనపై జాతీయ సదస్సు

కరీంనగర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): శాతవాహన విశ్వవిద్యాలయం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ట్రాన్స్ఫర్మేటివ్ రోల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ ఇన్ ది జర్నీ ఆఫ్ 2047 అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిజిటల్ పరివర్తనతో దేశం డిజిటల్ ఇండియా వైపు దూసుకెళ్తోందని, బ్యాంకింగ్, విద్య, వాణిజ్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ మాట్లాడుతూ యువతే డిజిటలైజేషన్‌కు ప్రధాన శక్తి అని, మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ఇండియా నినాదాలతో సాంకేతికతను సామాన్యుడికి చేరువ చేస్తూ వికసిత భారత్ నిర్మాణానికి పునాదులు వేస్తున్నామని




పేర్కొన్నారు. కీలక ఉపన్యాసకుడిగా పాల్గొన్న ఆచార్య జాస్తి రవికుమార్ మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపులు, డేటా ఆధారిత నిర్వహణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి జరుగుతోందని, 2047 నాటికి ప్రతి పౌరుడు డిజిటల్ అక్షరాస్యతతో పాటు సాంకేతికతను సృష్టించే స్థాయికి చేరుకోవాలని అన్నారు. సదస్సు డైరెక్టర్ డా. హరికాంత్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 130 పరిశోధన పత్రాలు సమర్పించబడ్డాయని, వాటిని ఐఎస్ఎస్ఎన్ జర్నల్‌లో మూడు భాగాలుగా విడుదల చేశామని తెలిపారు. ఇలాంటి సదస్సులు పరిశ్రమలు-- విశ్వవిద్యాలయాల మధ్య బంధాన్ని బలపరుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్లు డాక్టర్ తిరుపతి, డాక్టర్ నరేష్, డాక్టర్ పరుశురాములు, వివిధ కళాశాలల ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయవంతంగా గాలికుంట టీకాల కార్యక్రమం



**హుస్నాబాద్ , మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం గాలికుంట (ఎఫ్ఎమ్‌డీ) టీకాల కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. మండల పశు వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో గ్రామంలోని పశువులకు ఉచితంగా టీకాలు వేసి వ్యాధి నిరోధక శక్తి పెంపొందించేందుకు రైతులకు సూచనలు అందించారు. గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం గ్రామ ఆర్థికాభివృద్ధికి కీలకమని, ప్రభుత్వం చేపడుతున్న టీకాల కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు కానవేని శివకుమార్, పాలకేంద్ర చైర్మన్ పత్తేం రవీందర్, కోల ప్రభాకర్, బల్లు సుధాకర్, ఎనగందుల మహేందర్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, గ్రామ ప్రముఖులు, రైతులు పాల్గొన్నారు.

## దివంగత ఎస్సై చంద్రశేఖర్‌కు ఘన నివాళి



**కరీంనగర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఇటీవల అకాల మరణం చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌కు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో సంతాప సభ నిర్వహించారు. కమిషనర్ గౌష్ ఆలం పాల్గొని, ఇతర పోలీస్ అధికారులతో కలిసి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. కమిషనరేట్ సమావేశ మందిరంలో అధికారులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయన విధి నిర్వహణలో చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కమిషనర్ చంద్రశేఖర్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


# ఎలిగేడు మండలంలో పశువులకు గాలికుంటు నివారణ టీకా

ఎలిగేడు, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎలిగేడు మండలంలోని ర్యాకల్ దేవ్‌పల్లి గ్రామంలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 70 పశువులకు నిరోధక టీకాలు వేశారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్, ఉప సర్పంచ్ బొడిగె శివకృష్ణ గౌడ్, పశు వైద్యురాలు ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి డాక్టర్ హరిబాబు, వెటర్నరీ అసిస్టెంట్ శంకర్, గోపాలమిత్ర సమ్మయ్య పాల్గొన్నారు. అలాగే



వార్డు సభ్యులు ఎడ్ల సతీష్, మడ్లపల్లి అనిత, గుడికందుల చంద్రకళతో పాటు రైతులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించిన ఏ.వి. రమణ



**కరీంనగర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కరీంనగర్ అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికలు నేడు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా న్యాయవాది, మాజీ కార్పొరేటర్ ఏ.వి. రమణ తన ఓటు హక్కును వినియోగించారు. ఎన్నికల ప్రక్రియలో న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రజాస్వామ్య పద్ధతిలో తమ ప్రతినిధులను ఎన్నుకోవడం విశేషమైంది. ఓటు వేసిన అనంతరం ఏ.వి. రమణ మాట్లాడుతూ, న్యాయవాదుల సంఘం ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టే వేదికగా ఉండాలని, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఎన్నికైన ప్రతినిధులు కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో అడ్వకేట్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం, న్యాయవాదుల ఐక్యతను ప్రతిబింబిస్తోందని ఆయన పేర్కొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజం కోసం మహిళా విద్యార్థుల అవగాహన ర్యాలీ




**కరీంనగర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), కరీంనగర్ ఈకో క్లబ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, దానికి ప్రత్యామ్నాయాలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. కాశ్మీర్ గడ్డ రైతు బజార్‌లో జరిగిన ఈ ర్యాలీలో విద్యార్థినులు ప్రజలకు ప్లాస్టిక్ మానవాళికి, భూగ్రహానికి కలిగించే ప్రమాదాలను వివరించారు. ర్యాలీలో భాగంగా విద్యార్థినులు స్వచ్ఛ భూమాత" మరియు కలుషిత భూమాత" వేషధారణలో ప్రజలను ఆకట్టుకున్నారు. ప్రతి కూరగాయల వర్తకుడి వద్దకు వెళ్లి ప్లాస్టిక్ రహిత అమ్మకాలు చేపట్టాలని సూచించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి మాట్లాడుతూ, నేటి ప్లాస్టిక్ రేపటి సస్యశ్యామల భూమికి ఆటంకం కలిగిస్తుందని, పర్యావరణహిత వస్తువులను వాడుతూ సుస్థిర ప్రకృతి అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులకు హితవు పలికారు. ఆమె జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ నల్ల మనోజ్ కుమార్ మాట్లాడుతూ, రేపటి తరాలు ఆరోగ్యకరమైన జీవనంలో కొనసాగాలంటే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలని, సుస్థిర అభివృద్ధి కోసం భూమిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్. విద్య, లెక్చరర్లు చింతల రవళి కృష్ణ, అతియా సుల్తానా, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనరేట్ నెలవారి నేర సమీక్ష సమావేశం

**కరీంనగర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో నెలవారీ నేర సమీక్షా సమావేశం జరిగింది. కమిషనర్ గౌష్ ఆలం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధికారులు పెండింగ్ కేసుల పురోగతిని వివరించారు. సీపీ మాట్లాడుతూ 2024 వరకు పెండింగ్‌లో ఉన్న కేసులు, ఈ ఏడాది నమోదైన తీవ్రమైన నేరాలపై దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. మహిళలపై అఘాయిత్యాలు, పోక్సో చట్టం కింద నమోదైన కేసులు, ఆస్తి సంబంధిత నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సైబర్ నేరాల నివారణకు సీఈఐఆర్ పోర్టల్ వినియోగం, సీసీటీవీ కెమెరాల జియో-ట్యాగింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణ, ఇసుక అక్రమ రవాణా, పీడీఎస్ బియ్యం స్మగ్లింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ట్రాఫిక్ భద్రత కోసం వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని, ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని సీపీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, అదనపు డీసీపీలు వెంకటరమణ, ఏసీపీలు వేణుగోపాల్, శ్రీనివాస్, విజయకుమార్, వెంకటస్వామి, మాధవి, యాదగిరిస్వామి, సతీష్‌తో పాటు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ముట్టడి పిలుపుపై ఏఐవైఎఫ్ నాయకుల అరెస్టు

**హుస్నాబాద్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**: నిరుద్యోగుల సమస్యలపై ఒక ప్రజా సంఘం ఇచ్చిన చలో అసెంబ్లీ పిలుపుతో ఏఐవైఎఫ్‌కు ఎలాంటి సంబంధం లేకపోయినా సిద్దిపేట జిల్లా నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్ తెలిపారు. హుస్నాబాద్‌లో జనగాం రాజ్‌కుమార్, బెజ్జంకిలో మహేష్, అక్కన్నపేటలో బిచ్చల శ్రీనివాస్‌లను పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. ఏ కార్యక్రమాన్ని ఎవరు నిర్వహిస్తున్నారు, ఎవరు మద్దతు ఇస్తున్నారు అనే విషయాలు తెలుసుకోకుండా అరెస్టులు చేయడం పోలీసుల వైఫల్యమని విమర్శించారు. గురువారం తెల్లవారు జామున హుస్నాబాద్ పట్టణంలోని తన నివాసంలో హౌస్ అరెస్ట్ చేయడం



ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో నిరుద్యోగ యువత సమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలం గడిపేస్తున్నారని, ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకుండా, జాబ్ క్యాలెండర్ ప్రకటించకుండా, నిరుద్యోగ భృతి చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. అసెంబ్లీలో ఉద్యోగ నియామకాలపై చర్చ జరపకుండా ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని, నిరుద్యోగ యువత భవిష్యత్తుపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ, ఇకనైనా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకుని ఉద్యోగ నియామక ప్రక్రియను ప్రారంభించాలని కోరారు.

## ఘనంగా శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కరీంనగర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శిశుమందిర్‌లో శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీరాముని మహోన్నత గుణాలను స్మరించుకుంటూ ఆయన ఆదర్శాలను ఆచరణలో పెట్టే సంకల్పంతో ఈ వేడుకలు జరిగాయి. విద్యతో పాటు విలువలను బోధిస్తూ సమాజానికి ఆదర్శ పౌరులను తీర్చిదిద్దడంలో విద్యాపీఠం విశేష పాత్ర పోషిస్తోందని వక్త ఎలగందుల సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 176 పాఠశాలలు, 44 వేల మంది విద్యార్థులు, 2,600 మంది ఉపాధ్యాయులు, 5 లక్షల పూర్వ విద్యార్థులతో విద్యాపీఠం విశాల విద్యా వృక్షంగా ఎదిగి దేశ అభివృద్ధికి తోడ్పడుతోందని తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. భవిష్యత్తులో కూడా విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి కట్టుబడి పనిచేస్తామని ప్రధానాచార్యుడు రణధీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నా రెడ్డి, మెచినేని దేవేందర్ రావు, తాటి రాజేశ్వర్ రావు, కొత్తూరి ముకుందం, శ్రీరామోజు రవి, గట్టు రాంప్రసాద్, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన శ్రీరామ నవమి వేడుకలు





**పాలకుర్తి, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలంలోని గ్రామాల్లో శుక్రవారం జరగబోయే శ్రీరామ నవమి వేడుకలకు ముందుగా గురువారం పాలపొరక కార్యక్రమం ఘనంగా జరిగింది. భక్తులు ఎడ్లబండిపై అడవికి వెళ్లి పాలపొరక తెచ్చి పచ్చని పందిరి వేసి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారాముల కళ్యాణానికి ఆహ్వానించడం ఆనవాయితీగా కొనసాగింది. ఎడ్లబండిపై పాలపొరక తెచ్చిన భక్తులను గ్రామ పాలకవర్గాలు మంగళహారతులు, బాజా భజంత్రీలతో స్వాగతించి నూతన వస్త్రాలను సమర్పించారు. అదే రోజు పుణ్యాహవచనం, అంకురారోపణ పూజలు నిర్వహించి సీతారాముల విగ్రహాలను కళ్యాణానికి సిద్ధం చేశారు. గ్రామాల్లో భక్తులు విరాళాలు సేకరించి కళ్యాణం నిర్వహణకు దాతలు ముందుకు వచ్చారు. వేసవి కాలం కావడంతో ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, హనుమాన్ మాలధారణ స్వాములు, ప్రజలు పాల్గొన్నారు.

## జ్యోతి భా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**సిద్దిపేట, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దౌలతాబాద్ మండలం శేరిపల్లి బంధారం గ్రామంలోని మహాత్మ జ్యోతి భా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, పాలకూర పప్పు నాణ్యతపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వంట సిబ్బందిని మందలించారు. వంటగది, డైనింగ్ హాల్ ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులు రాత్రివేళల్లో మరుగుదొడ్ల మైదానంలో ఉండటంతో భయపడుతున్నారని ప్రిన్సిపల్ తెలియజేయగా, వసతి గృహంలో మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. విద్యార్థుల క్రమశిక్షణ, చదువు, వసతి, భోజనంలో లోటుపాట్లు లేకుండా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తరువాత రాయపోల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్ విధుల్లో లేరని సిబ్బంది చెప్పడంతో వీడియో కాల్ ద్వారా నిజనిర్ధారణ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం సహించేది లేదని హెచ్చరిస్తూ, ఆసుపత్రి సమయాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అనంతరం రాయపోల్ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. సమయపాలనతో పాటు ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియను పర్యవేక్షించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. రీజనల్ రింగ్ రోడ్ భూ సేకరణలో గ్రామాల వారీగా యజమానులతో మాట్లాడి ఆర్బిట్రేషన్ 100 శాతం పూర్తి చేయాలని సూచించారు.

## రాష్ట్రంలో విద్యారంగానికి ప్రాధాన్యత లేదా - ఎస్ఎఫ్ఐ




**కరీంనగర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల ముందు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్ మాట్లాడుతూ, తెలంగాణలో ప్రభుత్వ విద్యా రంగ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి కనీసం 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని, యూనివర్శిటీలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9500 స్కాలర్‌షిప్‌లు, ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయని, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, కెజిబివిలు ఎక్కువగా అద్దె భవనాలలో నడుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల కోసం ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు 218 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన పేరుతో ప్రభుత్వం విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన విమర్శించారు. అసెంబ్లీ కార్యక్రమంలో విద్యార్థి నాయకులపై పోలీసులు దాడి చేయడం ఖండిస్తూ, ఇకనైనా ప్రభుత్వం స్పందించి విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు గట్టు ఆకాష్, కమిటీ సభ్యులు సందేశ్, అక్షయ్, అంజి, రంజిత్, రాకేష్, కృప తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో భాగంగా నూతన సిసి రోడ్ ప్రారంభోత్సవం



**అమ్రాబాద్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ మల్కమామిడి గ్రామంలో నూతన సిసి రోడ్డును గ్రామ సర్పంచ్ శాంతమ్మ ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సహకారంతో సాధ్యమైందని గ్రామ ప్రజలు తెలిపారు. డిప్యూటీ సర్పంచ్ జీవన్ రెడ్డి అభ్యర్థనపై వెంటనే స్పందించి రహదారి మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యు ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్, తాలూకా అధ్యక్షుడు లడ్డు యాదవ్, వార్డు సభ్యులు బుచ్చమ్మ, అంజి, మాజీ వార్డు సభ్యుడు ఓంకారం, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అంజి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అశోక్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, రమేష్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధికై పురపాలక సంఘం బడ్జెట్ సమావేశం



**అచ్చంపేట, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట మున్సిపల్ కార్యాలయంలో 2026--27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశం ఘనంగా జరిగింది. మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ, జిల్లా అదనపు కలెక్టర్, కమిషనర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్ రూపొందించామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించామని పేర్కొన్నారు. పట్టణాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, కమిషనర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కరెంటు కోతులపై రైతుల నిరసన



**కుకునూరుపల్లి, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కుకునూరుపల్లి మండలం మేదినేపూర్ సబ్‌స్టేషన్ వద్ద రైతులు ఈరోజు ధర్నా చేపట్టారు. కరెంటు కోతలతో పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేసిన రైతులు, కనీసం రోజుకు 18 గంటలు నిరవధికంగా విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సబ్‌స్టేషన్ ముందు పెద్ద సంఖ్యలో రైతులు చేరి నినాదాలు చేస్తూ తమ సమస్యలను అధికారులకు తెలియజేశారు. పంటలు నిలువకపోతే తమ జీవనోపాధి దెబ్బతింటుందని, విద్యుత్ సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దేవి రవీందర్, ఇతర గ్రామాల రైతులు, సర్పంచులు పాల్గొన్నారు.

# గిరిజనులకు అత్యధిక ప్యాకేజ్‌తో పునరావాసం

**అమ్రాబాద్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్యాకేజ్‌తో పునరావాసం కల్పిస్తోంది. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ చొరవతో సార్లపల్లి, కుడిచింత బైలు పునరావాస గ్రామాలకు చెందిన కుటుంబాలకు హైదరాబాద్‌లో చెక్కుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్, అటవీ అధికారులు పాల్గొన్నారు. మొదటి దశలో నాలుగు గ్రామాలకు చెందిన 417 కుటుంబాలకు పునరావాసం కల్పించనున్నారు. ఇందులో 160 కుటుంబాలకు నగదు పరిహారం, 257 కుటుంబాలకు ఇల్లు, 5 ఎకరాల భూమి కేటాయిస్తున్నారు. ఒక్కొక్క







కుటుంబానికి 15 లక్షల పరిహారం అందజేస్తుండగా, ఇది దేశంలో అత్యధిక ప్యాకేజీలలో ఒకటిగా భావిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బాచారం వద్ద ఆధునిక సదుపాయాలతో పునరావాస కాలనీ నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ. 62.55 కోట్లు కేటాయించింది. పునరావాసం తర్వాత గిరిజన కుటుంబాలకు పక్కా గృహాలు, తాగునీరు, విద్యుత్, ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. గిరిజన పిల్లలకు డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ పునరావాసం ద్వారా సుమారు 1501 హెక్టార్ల అటవీ భూమి పునరుద్ధరణకు అవకాశం లభించనుంది. పులులు, వన్యప్రాణుల సంరక్షణకు ఇది కీలకమవుతుందని అధికారులు పేర్కొన్నారు. బాచారం పునరావాస కాలనీని మోడల్ గ్రామంగా అభివృద్ధి చేయడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## శ్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల

# జాతర పోస్టర్ ఆవిష్కరణ

**బెజ్జంకి, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

బెజ్జంకి శ్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతియేటా చైత్ర శుద్ధ సప్తమి నుంచి చైత్ర బహుళ సప్తమి వరకు జరిగే బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఆలయ ధర్మకర్తలను కోరారు. ఏకశిలతో నిర్మితమైన ఈ ఆలయానికి విశేష ప్రాశస్యత ఉందని, భక్తులు కరీంనగర్, సిద్ధిపేట, హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్‌తో పాటు నాగపూర్, నాందేడ్, గుల్బర్గా, ముంబాయి వంటి దూర ప్రాంతాల నుంచి కూడా తరలి వస్తారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్, పూజారులు, ధర్మకర్తలు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేసి స్వామివారి కళ్యాణం, శకటోత్సవం, రథోత్సవాలకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్,





మండల పార్టీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఆలయ పూజారి శేష మధుసూదనాచారి, ధర్మకర్తలు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో చేపట్టిన పంచాయతీ రాజ్ రోడ్ల పనులకు సత్వరమే నిధులు విడుదల చేస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలో ఆరు మండలాల సర్పంచులు, పార్టీ నాయకులు అసెంబ్లీలో వినతిపత్రం అందజేయగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. సుమారు రూ. 30.44 కోట్ల విలువైన పనులు నిధుల కొరతతో నిలిచిపోయాయని, వాటిని త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. నూతనంగా ఏర్పాటైన గన్నేరువరం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయానికి కొత్త భవనం నిర్మిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయానికి సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజాప్రతినిధులు తెలియజేయగా, మంత్రి వెంటనే స్పందించారు. మానకొండూర్ మండల పరిధిలోని పచ్చునూరును కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కోరగా, మంత్రి సీతక్క సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని తెలిపారు.

# సలేశ్వరంలో జాతర ఏర్పాట్లు పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**అమ్రాబాద్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

నల్లమల అడవిలోని లింగమయ్య స్వామి ఆలయంలో ఏప్రిల్ 1 నుంచి 3 వరకు జరగనున్న సలేశ్వరం జాతరకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి అటవీ ప్రాంతాన్ని సందర్శించి, జాతర ఏర్పాట్లు, ట్రెక్కింగ్ మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అడవిలోని క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని



సూచించారు. భక్తుల సౌకర్యం కోసం తాగునీటి సరఫరా, వైద్య సేవలు, తాత్కాలిక శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు, మార్గదర్శక బోర్డులు, ప్రమాద సూచనలు, చెత్త నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. అగ్నిప్రమాదాల నివారణ కోసం ఫైర్ ఇంజిన్లు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని, పోలీస్ శాఖ ద్వారా ప్రత్యేక ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా విస్తరించడం, చల్లని నీడ కల్పించే శిబిరాలు ఏర్పాటు చేయడం, మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. గర్భిణీ మహిళలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న భక్తులు జాతరకు రాకుండా జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. భక్తులందరూ సురక్షితంగా, సౌకర్యవంతంగా స్వామి దర్శనం చేసుకోవడమే లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భనలో జిల్లా అటవీ అధికారి రేవంత్ చంద్ర, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రామేశ్వరం దేవాలయంలో హుండీ లెక్కింపు

**- ఆరు నెలల ఆదాయం రూ.9,35,070**

ఫరూక్‌నగర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూక్‌నగర్ మండల రామేశ్వరం గ్రామ చారిత్రాత్మక దేవాలయంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి శివకుమార్ ఆధ్వర్యంలో భక్తులు పాల్గొని హుండీ లెక్కింపు చేపట్టారు. ప్రతి



సంవత్సరం దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హుండీ లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని ఆలయ ఈఓ తెలిపారు. ఈసారి ఆరు నెలల కాలానికి హుండీ ఆదాయం మొత్తం రూ. 9,35,070గా నమోదైనట్లు శివకుమార్ స్పష్టం చేశారు.

## సీసీ రోడ్ల పనులు ప్రారంభించిన సర్పంచ్ మట్ట యాదమ్మ



**వెల్దండ, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

వెల్దండ మండల కేంద్రంలోని నాల్గవ వార్డులో గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీసీ రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మట్ట యాదమ్మ మాట్లాడుతూ, "గ్రామ అభివృద్ధి మా లక్ష్యం. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీను, కూన సావిత్రమ్మ, పంచాయితీ కార్యదర్శి గిరి గౌడ్, నాల్గవ వార్డు సభ్యురాలు జంగిలి సునీత ఆనంద్, గ్రామ వార్డు సభ్యులు పాలాది మల్లీశ్వరి రంగనాథం, ముదికొండ కవిత రమేష్, పసునోజు వాణి పురుషోత్తం, గుద్దటి కిష్టల్, గోసుల కొండయ్య, మసిగుండ్ల వెంకటేష్, మారేపల్లి మంజుల శ్రీను, పిల్లి దేవేందర్, శిరుశనగండ్ల శేఖర్, గోపిరెడ్డి రాఘవరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మట్ట భరత్, యువ నాయకులు జంగిలి ఆనంద్ రాజ్, రేవల్లి రాజు, ఏకుల వెంకటేష్, జంగిలి ప్రవీణ్, జంగిలి కొండలు, కూన ప్రశాంత్, మట్ట నాగార్జున, గోరటి భరత్, డేవిడ్, కూన నాని, బన్నీ, మహేందర్, చిన్న, కిరణ్, కూల కృష్ణయ్య, జంగిలి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.


## ఎస్సీ కార్పొరేషన్ స్వయం ఉపాధి పథకాల దరఖాస్తు గడువు పొడిగింపు



**నాగర్‌కర్నూల్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎస్సీ యాక్షన్ ప్లాన్ ఫేజ్--1 దరఖాస్తుల గడువును ఏప్రిల్ 2వ తేదీ వరకు పొడిగించినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడి ఎస్. గోపాల్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు అనుసంధానంతో టూ వీలర్, త్రీ వీలర్, ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ పంపు సెట్లు, మైనర్ ఇరిగేషన్, డెయిరీలు, వ్యవసాయ డ్రోన్లు, వ్యవసాయ పరికరాలు, మల్బరీ పట్టు పురుగుల పెంపకం, పందిరి కూరగాయల సాగు, పామాయిల్ మొక్కల పెంపకం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ తదితర పథకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుదారులు టీజీ-- ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

## శ్రీరామ నవమి పండుగ సందర్భంగా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో శాంతి సమావేశం



**షాద్‌నగర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**


శ్రీరామ నవమి పండుగను శాంతి, సౌహార్ద్ర వాతావరణంలో జరుపుకునేందుకు గురువారం షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏసీపీ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. పట్టణం పరిసర ప్రాంతాలకు చెందిన మత పెద్దలు, సామాజిక నాయకులు, ప్రజాప్రతినిధులు, గౌరవనీయ పౌరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మత గురువులు, స్థానిక నాయకులు మాట్లాడుతూ, "పండుగను పరస్పర అవగాహనతో, ఐక్యతతో జరుపుకోవాలి. సమాజంలో శాంతి, సౌహార్ద్రతలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత" అని సూచించారు. ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, "పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ అన్ని రకాల భద్రతా చర్యలు చేపడుతోంది. శోభాయాత్రలను ప్రశాంతంగా, క్రమశిక్షణతో నిర్వహించాలి. ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగించే ప్రయత్నం చేస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. ఈ సమావేశాన్ని ఎస్‌హెచ్‌ఓ సమన్వయం చేశారు. పోలీస్ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, "పండుగల సందర్భంగా పరస్పర గౌరవంతో, స్నేహభావంతో, ప్రశాంతంగా ఉత్సవాలను జరుపుకోవాలి" అని సూచించారు.

## మానుకోట శ్రీరామాలయంలో 68వ వసంత నవరాత్రి మహోత్సవాలు



**మానుకోట, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మానుకోట శ్రీరామాలయంలో జరుగుతున్న 68వ శ్రీ సీతారామ వసంత నవరాత్రి మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచనంలో భాగంగా నోరి కోదండరాం గారు "సుందరకాండ" అంశంపై భక్తులకు ఉపన్యాసం అందించారు. ఆంజనేయ స్వామి లంక ప్రయాణం, సీతామాత దర్శనం, లంక దహనం, శ్రీరామునికి సీతాదేవి సమాచారం చేరవేత వంటి ఘట్టాల ఆధ్యాత్మిక తాత్పర్యాన్ని ఆయన సవివరంగా వివరించారు. భక్తి, ధైర్యం, నిస్వార్థ సేవ, గురుభక్తి వంటి విలువలను సుందరకాండ ఎలా ప్రతిబింబిస్తుందో సంకీర్తనలతో వివరిస్తూ భక్తులను ఆధ్యాత్మిక చైతన్యంతో నింపారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బీరంగూడ జగన్మోహన్‌రెడ్డి



**షాద్ నగర్, మార్చి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈరోజు జరిగిన న్యాయవాద బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఉత్కంఠభరిత పోరులో బీరంగూడ జగన్మోహన్‌రెడ్డి విజయం సాధించి నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 170 ఓట్లకు జరిగిన ఎన్నికల్లో 161 ఓట్లు పోలయ్యాయి. వీటిలో బీరంగూడ జగన్మోహన్‌రెడ్డికి 67 ఓట్లు, నర్వ వేణుగోపాల్‌కు 66 ఓట్లు, దానక్క సంగమేశ్వరకు 23 ఓట్లు, రజాక్ హుస్సేన్‌కు 5 ఓట్లు లభించాయి. ఒక్క ఓటు తేడాతో బీరంగూడ విజయం సాధించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా బీరంగూడ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, "తనకు ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు" అని తెలిపారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

– మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్



**ఆమనగల్లు, మార్చి 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ప్రతిభ నగర్ కాలనీలో గత కొన్నేళ్లుగా మంచినీటి కలెక్షన్ లేక వార్డు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇట్టి విషయాన్ని అవార్డు కౌన్సిలర్ ఎంగలి భాగ్యమ్మ రఘు, ఛైర్మెన్ పత్యనాయక్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన వారు గురువారం సమస్యను పరిష్కరించి ఇంటింటికి నీటి కలెక్షన్ కల్పించి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పత్యనాయక్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా పని చేస్తామన్నారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందిస్తామన్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగిళ్ళ జగన్, అవ్వారి శివలింగం, గుద్దేటి మహేష్, ఎంగలి యాదగిరి, గుండ్రతి కుమార్ గౌడ్, శివ, సురేష్, ఉమాపతి గౌడ్, జంగయ్య, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన యాదిలాల్





ఆమనగల్లు, మార్చి 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్):
ఆమనగల్లు బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికలు సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మ ఆధ్వర్యంలో ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. ఎన్నికల్లో ఆమనగల్లు బార్ అసోసియేషన్ కార్యాలయంలో సభ్యత్వం పొందిన 26 మంది న్యాయవాదుల గాను అందరూ హాజరై తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి అండేకార్ యాదిలాల్ మరియు దుడ్డు ఆంజనేయులు పోటీలో ఉండగా ఆంజనేయులు పై అండేకార్ యాదిలాల్ గురువారం విజయం సాధించారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శి పదవికి ముక్తాల విజయ్ కుమార్ మరియు ఏర్పుల రామకృష్ణ పోటీలో ఉండగా రామకృష్ణ పై విజయ్ కుమార్ విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా ఏ. శేఖర్. సంయుక్త కార్యదర్శిగా మధు గౌడ్. కోశాధికారిగా ఎగిరిశెట్టి మల్లేష్, గ్రంథాలయ కార్యదర్శిగా గణేష్ గౌడ్, క్రీడా కార్యదర్శిగా సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా దేవేందర్ గౌడ్, సర్దార్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రెండవసారి అధ్యక్షులుగా గెలుపొందిన అధ్యక్షులు అండేకర్ యాదిలాల్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్ లను న్యాయవాదులు శాలువాలతో సత్కరించారు. అధ్యక్షులుగా గెలుపొందిన అండేకార్ యాదిలాల్ మాట్లాడుతూ.. ఆమనగల్లు బార్ అసోసియేషన్ అభివృద్ధి కోసం. న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మల్లేపల్లి జగన్, మల్లేష్ గౌడ్, జానకి రాములు, సుధాకర్ రెడ్డి మరియు న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

## మార్చి 28న బెంగాల్ ఎన్నికల ప్రచారానికి అమిత్ షా



**న్యూఢిల్లీ మార్చి 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), బిజెపిల మధ్యే ప్రధానంగా పోటీ నెలకొననుంది. దీంతో ఇరుపార్టీలు ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగిస్తున్నాయి. మార్చి 28న కేంద్ర హోంమంత్రి అమిత్ షా బెంగాల్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అధికారంలో ఉన్న టిఎంసి అవకతవకల్ని బయటపెట్టేందుకు ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రజల ముందుంచనున్నారు. అలాగే టిఎంసిపై ఛార్జిషీటును దాఖలు చేయనున్నారు. కాగా, మార్చి 28వ తేదీన హోం మంత్రి అమిత్ షా ఒక ముఖ్యమైన పత్రికా సమావేశం నిర్వహించి, టిఎంసి ప్రభుత్వంపై ఛార్జిషీట్ దాఖలు చేయనున్నారు. గత కొన్నేళ్లుగా టిఎంసి ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, పాలనా వైఫల్యాలు, శాంతిభద్రతల సమస్యలపై ఛార్జిషీట్‌లో సమగ్ర వివరాలు పొందుపరిచే అవకాశం ఉందని బెంగాల్ బిజెపి పార్టీ తెలిపాయి. ఛార్జిషీట్‌త్‌పాటు మమతా 15 ఏళ్ల పాలనలో అవినీతి, ఇతర అంశాలను ఎత్తిచూపుతూ బిజెపి ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయనుంది.

## కీలక బిల్లుకు కెనడా చట్టసభ ఆమోదం..

ఇక ఖలిస్థానీ ఆగడాలకు అడ్డుకట్ట..!

**న్యూఢిల్లీ మార్చి 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కెనడా చట్టసభ కీలక బిల్లుకు ఆమోదం తెలిపింది. విద్వేషపూరిత చర్యలు, నేరాలను అరికట్టేందుకు తీసుకొచ్చిన కంబాటింగ్ హేట్ బిల్లు కు ఆ దేశ చట్టసభ ఆమోదం తెలిపింది. ఈ కీలక బిల్లుకు హౌస్ ఆఫ్ కామన్స్ ఆమోదముద్ర వేసింది. అనంతరం ఆ బిల్లును ఎగువసభకు పంపించారు. ఈ బిల్లు చట్టంగా మారి అమలులోకి వస్తే ప్రార్థనా స్థలాలపై దాడులకు, ఖలిస్థానీ మద్దతుదారుల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ చట్టం ప్రకారం విద్వేష చిహ్నాలను బహిరంగంగా ప్రదర్శించడాన్ని నేరంగా పరిగణిస్తారు. ఈ చట్టం కోసం కెనడాలోని భారత సంతతి వ్యక్తులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారు. కెనడాలో ఖలిస్థానీల ఆగడాలు పెరిగిపోయాయి. కొన్ని వర్గాల వారిని లక్ష్యంగా చేసుకుంటూ బెదిరింపులకు పాల్పడుతుండటం, విధ్వంసం సృష్టించడం తదితర ఘటనలు పెరుగుతున్నాయి. ఇలాంటి ఘటనలపై అక్కడి భారతీయులు చాలా ఏళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో విద్వేష చర్యలకు సంబంధించి కొత్త బిల్లు ఆమోదం పొందడం ఆహ్వానించదగిన పరిణామంగా చెప్పవచ్చు.

## ఆలయాలు ముస్తాబు




**ఆమనగల్లు, మార్చి 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
శ్రీ రామనవమిని పురస్కరించుకుని నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమనగల్లు పట్టణంలోని హనుమాన్, శ్రీ భక్తమార్కండేయస్వామి, పట్టణ సమీపంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి, అయ్యసాగరంలోని రామాలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య దేవతామూర్తుల పెళ్లి జరపనున్నారు. స్వామివారి కల్యాణోత్సవానికి భక్తుల తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

### వేం నరేందర్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి



**ఆమనగల్లు, మార్చి 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని ఆయన నివాసంలో గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలను, ప్రజల ఆకాంక్షలను పెద్దల సభలో సమర్థవంతంగా వినిపిస్తూ తన అపార అనుభవంతో దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆకాంక్షించారు. కలిసిన వారిలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఉన్నారు.

### కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు



**ఆమనగల్లు, మార్చి 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలంతా శ్రీరామనవమిని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. నవమి రోజున ప్రతి ఏటా వైభవోపేతంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించుకుంటారన్నారు. లోక కల్యాణం కోసం ఎన్నోత్యాగాలకోర్చిన సీతారాముల పవిత్ర బంధం అజరామరమైనదని, రాబోయే తరాలకు ఆదర్శనీయమైనదని ఆయన అన్నారు. సీతారాముల ఆశీస్సులు ప్రజలకు ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవనం సాగించేలా దీవించాలని సీతారామచంద్రమూర్తులను ప్రార్థించనున్నట్టు ఆయన తెలిపారు.